క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని చింతకుంటకు చెందిన ధనుష్‌గౌడ్‌కు మంజూరైన రూ.20వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ అనూష్ అందజేశారు. సీఎంఆర్ఎఫ్ సహాయంతో పేద కుటుంబాలు కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే అవకాశం ఉందన్నారు. చెక్కు మంజూరు చేయించిన కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కృషి చేసిన మండల ప్రజాప్రతినిధులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతయ్య, రాములు, బాలస్వామి, హకీంపాష, సుల్తాన్, పరమేష్, ఎల్లయ్య, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

'బీఏ' లో ప్రవేశాలకు ఆహ్వానం



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ కోర్సులో ప్రవేశానికి దోస్త్ ద్వారా విద్యార్థులు నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా రెండో విడత దోస్త్ ద్వారా విద్యార్థులు బీఏ కోర్సులో చేరాలని అధ్యాపకులు బుధవారం తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థినికి సన్మానం

కొత్తకోట: మండలంలోని అప్పరాల జెడ్పీహెచ్‌లో పదో తరగతి చదివిన హైమావతి పరీక్ష ఫలితాల్లో 9.5జీపీఏ సాధించి మండలంలో టాపర్‌గా నిలిచింది. బుధవారం మంత్రి నిరంజన్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ హైమావతిని, తల్లిదండ్రులకు శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని, రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలు ఎక్కువగా ఉండాలని మంత్రి సూచించినట్లు హెచ్ఎం గోపాల్ అన్నారు.

రంగనాయకస్వామి ఆలయంలో పూజలు



పెబ్బేరు రూరల్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాయకస్వామి ఆలయంలో అర్చకులు, సిబ్బంది స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీజేపీ నాయకుడికి..



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ పూర్వ నాయకుడు బెస్త బాలయ్యను ఘనంగా సన్మానించారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి బెన్నూరు ఆశన్న ఆధ్వర్యంలో బాలయ్య ఇంటి వెళ్లి ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. బీజేపీపై ఆయనకు ఉన్న అభిమానాన్ని వారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డల ప్రధాన కార్యదర్శులు అంజనేయులు ముదిరాజ్, శివశంకర్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి

కొల్లాపూర్: బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఇచ్చిన దరఖాస్తు గడువును పొడిగించాలని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కట్టా శ్రీనివాసులు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయాల్లో సాంకేతిక సమస్యల కారణంగా చాలా మంది సకాలంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు

కొల్లాపూర్: పట్టణానికి చెందిన బుడగ జంగాల కులస్తుడు కప్పెర శంకర్(29) ఈ నెల 12 నుంచి కనిపించకుండా పోయాడు. అతని కుటుంబీకులు పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు బుధవారం కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శంకర్ అదృశ్యంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.బాలవెంకటరమణ వెల్లడించారు.



ఖిల్లాఘనపురంలో ధ్యానం చేస్తున్న సర్పంచ్ తదితరులు



శ్రీరంగాపురంలో..



అమరచింతలో..



పిన్నంచర్లలో..

యోగాతోనే మానసిక ప్రశాంతత



పెబ్బేరులోని మత్స్య కళాశాలలో యోగా చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కొత్తకోట: అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం పట్టణ కేంద్రంలోని రాజకీయ నాయకులు, మేధావులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ఛత్రపతి శివాజీ వాకింగ్ గ్రూప్ సభ్యులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో సిటీ కేబుల్ రాంరెడ్డి, స్టార్ ఆంజనేయులు, యాదయ్యసాగర్, కొండారెడ్డి, రవిసాగర్, అడ్వకేట్ యాదగిరి, లాల్‌కోట రవి, రాజుయాదవ్ నాగరాజు, రాంచంద్రారెడ్డి, శివయాదవ్, వేణు తదితరులు ఉన్నారు.

అమరచింత: ప్రతినిత్యం అరగంట పాటు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారే అవకాశం ఉందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సరస్వతి శిశుమందిరం ఆవరణలో బుధవారం యోగాసనాలు వేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మానవుడు కంప్యూటర్ పరిజ్ఞానంతో పరుగెడుతూ శరీరానికి ఇవ్వాల్సిన సమయాన్ని ఇవ్వలేక పోతున్నాడని, దీంతో పిన్న వయస్సులోనే రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవన భృతితో పాటు శరీరానికి కావలసిన వ్యాయామం అందినపుడు శరీర భాగాలు ఉల్లాసంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ప్రతి నిత్యం యోగా చేయడంతో రోగాలు దూరం అవుతూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోప్లాపూర్, అన్నారం, దావాత్‌ఖాన్‌పల్లి, చింతకుంట గ్రామాల్లో నిర్వహిస్తున్న అమృత్‌సరోవర్ ఊట కుంటల వద్ద ఉపాధి కూలీలతో కలిసి యోగాసనాలు చేశారురు. అనంతరం ప్రతినిత్యం యోగా చేయడంతో కలిగే లాభాలు, అవశ్యకతపై కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాణి, రాములు, నాగేష్‌నాయుడు, అనూష, ఎస్ఆర్ఈజీఎస్ ఈసీ అంజన్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మత్స్య కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమని విద్యార్థులకు వివరించారు. భారత సంప్రదాయం, సంస్కృతి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రదీప్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగంగా యోగా సాధన అలవాటు చేసుకోవాలని సర్పంచ్ వినీలారాణి సూచించారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సిబ్బందితో కలిసి యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నందకిషోర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలో అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వనం సభ్యుడు దీర్ఘాయువు ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. గ్రామస్తులు, విద్యార్థులు సూర్య నమస్కారాలు చేశారు. ఖిల్లాఘనపురంతో పాటు అన్ని గ్రామాల్లో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొ కూలీలు, మహిళలు, యువకులు యోగా చేశారు.



కొత్తకోటలో యోగాసనాలు వేస్తున్న ఛత్రపతి శివాజీ వాకింగ్ గ్రూప్ సభ్యులు



హీర్లతండాలో..



దావాత్‌ఖాన్‌పల్లిలో యోగా చేస్తున్న ఉపాధి కూలీలు

కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న కొమ్ము భరత్‌భూషణ్

కొత్తకోట: సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది అన్నట్లు బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో వెచ్చిస్తున్న కేంద్ర నిధులను, తమ నిధులని గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటని భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకుడు కొమ్ము భరత్‌భూషణ్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వనపర్తి జిల్లాలో నూతనంగా 15 హెల్త్ కేర్ సెంటర్లు నిర్మించేందుకు కేంద్రం ఒక్కో దానికి రూ. 20 లక్షల చొప్పున నేషనల్ హెల్త్ మిషన్ ఫండ్స్ ద్వారా నిధులు విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను ఈ ఏడాది జనవరిలోనే అప్పట్లో పనిచేసిన కలెక్టర్ యాస్మిన్‌బాషాకు ఇచ్చినట్లు గుర్తుచేశారు. కానీ ఇక్కడి బీఆర్ఎస్ నాయకులు తమ ఎమ్మెల్యే నిధులని చెప్పుకోవడమే కాకుండా, వారికి అనుకూలమైన స్థలాల్లో హెల్త్ కేర్ సెంటర్లను నిర్మించేందుకు సిద్ధపడుతున్నారని మండిపడ్డారు. ప్రజలకు అనుకూలమైన స్థలాలను గుర్తించి హెల్త్ కేర్ సెంటర్లు నిర్మించాలని అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో మద్దగట్ల శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మన్నెం యాదవ్ పాల్గొన్నారు.

ఏకకాలంలో పంట రుణమాఫీ చేయాలి



అమరచింతలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ చేయాలని, అలాగే పెట్టుబడుల కోసం కొత్త రుణాలు ఇవ్వాలని అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. వానాకాలం సీజన్‌లో రైతులకు వడ్డీ లేని రుణాలు, ఉచితంగా ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు ఇవ్వాలని కోరారు. సమగ్ర పంటల బీమా వర్తింపచేయడంతో పాటు ధరణి పోర్టల్‌లో ఉన్న లోపాలను సరిదిద్దాలని, కౌలు రైతులకు పంటల నష్ట పరిహారం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారం పంటలకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సింధూజకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, వెంకటయ్య, యేసన్న, మణివర్ధన్, ఆశన్న, రైతులున్నారు.

అమరచింత: వానాకాలం సీజన్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ చాంద్ పాషాకు వినతిపత్రం అందించారు.

'అక్రమ కేసులు పెడితే సహించేది లేదు'



మాట్లాడుతున్న బసిరెడ్డి సంతోష్‌రెడ్డి

కొత్తకోట: దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి సంబంధించిన అక్రమ ఆస్తులను ప్రశ్నిస్తున్న బీఎస్పీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని ఆ పార్టీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జీ బసిరెడ్డి సంతోష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కొత్తకోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అక్రమాలను ప్రతి నిత్యం సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తున్న బీఎస్పీ సీనియర్ నాయకుడు డేవిడ్ రాజ్‌పై పోలీసులు దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో తప్పు చేసిన వారిని ప్రశ్నించడం ప్రతి ఒక్కరి హక్కు అని చెప్పారు. 2014 ఎన్నికల్లో ఆల వెంకటేశ్వర్‌రెడి పోటీ చేసినప్పుడు ఆయన ఆస్తులు ఎంత అని, ఇప్పుడు ఎంత పెరిగాయని ప్రశ్నించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని నియోజకవర్గంలో మోసాలు, అక్రమాలు చేస్తూ ఉంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో సత్యనారాయణ సాగర్, రవీంద్ర, బురాన్, చిన్నకురుమన్న, రాములు, కుర్మన్న, బుచ్చన్న, పాతిమా బేగం, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

అమరచింత: మండలంలోని మస్తీపురం ఎక్స్ రోడ్‌లో బుధవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మస్తీపురం గ్రామానికి చెందిన శ్రీనాథ్ ద్విచక్ర వాహనంపై ఆత్మకూర్‌కు, గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని వామనపల్లికి చెందిన లచ్చన్న మోటర్ బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా వాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. దీంతో శ్రీనాథ్‌తో పాటు లచ్చన్నకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనాథ్‌ను ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, లచ్చన్నను గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివనాగేశ్వర నాయుడు తెలిపారు.

ఆర్టీసీ టీ9 టికెట్లను వినియోగించుకోండి



కొల్లాపూర్: ఆర్టీసీ సంస్థ నూతనంగా అమలులోకి తీసుకొచ్చిన టీ-9 టికెట్లను మహిళలు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కొల్లాపూర్ డిపో మేనేజర్ రాజేశ్వర్ సూచించారు. టీ-9 టికెట్లను ఈ నెల 18 నుంచి అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 60 కి.మీటర్ల పరిధిలో మహిళలు, వృద్ధులు ప్రయాణాలు కొనసాగించేందుకు రూ.100 చెల్లించవచ్చన్నారు. ఈ టికెట్‌తో నిర్ణీత సమయంలో 60 కిలోమీటర్ల పరిధిలో ఉచిత ప్రయాణాలు చేయవచ్చన్నారు. మహిళలు, వృద్ధులు తమ ఆధార్‌కార్డును చూపించి టీ-9 టికెట్ పొందవచ్చన్నారు. కొల్లాపూర్ డిపోలో అత్యధికంగా టీ-9 టికెట్లు అమ్మిన కండక్టర్లు అశోక్, సాయిగీతలకు ఆర్టీసీ డీఎం సజ్జనార్ నుంచి ప్రశంసలు అందాయని తెలియజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

గురువారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం.రాజేశ్వర్ తెలిపారు. కొల్లాపూర్ ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యలు, సలహాలను తెలియజేసేందుకు ప్రయాణికులు సెల్ నం. 9000405878 కు ఫోన్ చేయాలని సూచించారు.

హెచ్ఎంకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



పెబ్బేరులో శివశంకర్‌ను సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకటేష్‌యాదవ్ సేవలకు గుర్తింపుగా మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. వార్డుతో పాటు ప్రశంసాపత్రం, మెమెంటోను అందజేశారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేసిన కొత్తపేట గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ తిరుపతయ్యసాగర్‌కు ఉత్తమ డోనర్ అవార్డును మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అందించారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయుడికి సన్మానం..

పెబ్బేరు: మండలంలో కంచిరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శివశంకర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడంతో బుధవారం వాకర్స్ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంతోష్, సుధాకర్, కృష్ణాజి, మహేష్, రమేష్, అంజనేయులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లాయిపల్లి ఆలయంలో నిత్య పూజలు



ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో ప్రొసీడింగ్ కాపీని అందుకుంటున్న ఎంపీపీ, పూజారి

పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లి గ్రామ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి దూప, దీప, నైవేద్యం పథకం అమలుతో పూజారికి వేతనం అందనుండటంతో నిత్యం పూజలు జరుగుతాయని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ధూప, దీప, నైవేద్యం పథకం అమలు ప్రొసీడింగ్ కాపీని బుధవారం ఎమ్మెల్యే ఆలయ అర్చకుడికి అందజేశారు. ఆలయానికి ఈ పథకం అమలుతో అర్చకుడికి నెలకు రూ. 10 వేలు వేతనం అందుతాయన్నారు. ఎమ్మెల్యే కృషితోనే ఆలయానికి ఈ పథకం అమలైందని, గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్నట్లు ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, ఆలయ పూజారి శశాంక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చర్చిలో సామూహిక ప్రార్థనలు



చర్చిలో ప్రార్థన చేస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: రాష్ట్రంలోని ప్రజలందరూ సుభిక్షంగా, అష్ట ఆయురారోగ్యాలతో ఉండాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. బుధవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీలోని ఎంబీ కర్మేల్‌చర్చిలో ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మండలంలోని పిన్నంచర్లలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ నర్సింగ్‌రావు, పాస్టర్ జర్మియ, కౌన్సిలర్లు యాదమ్మ, తబస్సుంమోసీన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యాదర్శులు, గ్రామస్తులు తదితరలు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు విక్రయిస్తే ఆందోళన చేస్తాం

కొల్లాపూర్: ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పేరుతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఆందోళన చేస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



సైమన్‌ను పరామర్శిస్తున్న నాగరాజ్ గౌడ్

అమరచింత: కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటూ వారిని అన్ని విధాలుగా ఆదుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సైమన్ సెంట్రింగ్ పనులు చేస్తూ విద్యుత్ షాక్‌కు గురై మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని బాధితుడిని పరామర్శించారు. ఈమేరకు చికిత్స పొందుతున్న సైమన్‌ను ధైర్యం చెప్పడంతో పాటు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధిత కుటుంబ సభ్యులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్, మహేందర్‌రెడ్డి, పోషిరిగారి విష్ణు, శ్యామ్, ప్రకాశం, హన్మంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

కొల్లాపూర్: పట్టణ సమీపంలోని సోఫీ చమన్ దర్గా గంధోత్సవ వేడుకలను బుధవారం రాత్రి ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జామెమసీద్ ఆఫీసాహెబ్ ఆరీఫ్‌షుత్తారీ ఇంటి నుంచి గంధోత్సవం బయలుదేరింది. ముస్లింలు పెద్దసంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. సోఫీ చమన్ దర్గాకు గంధోత్సవం చేరుకున్నాక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి హైదరాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన కళాకారులు ఖవ్వాలీ ప్రదర్శనలు ఇచ్చారు. షుత్తారీ, అహ్మద్‌ఘోరీ, ఫయాజ్, ఖాదర్‌పాష తదితరులున్నారు.

మహనీయుల సేవలు వెలకట్టలేనివి



వనపర్తిలో జయశంకర్, గూడ అంజన్న చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: మహనీయుల పోరాటాలు, త్యాగాలను నేటి యువతరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ 12వ, పాటకు ప్రాణం పోసిన ప్రముఖ రచయిత గూడ అంజయ్య 7వ వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు జయశంకర్, గూడ అంజయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా సమాజాన్ని చైతన్య పరచడంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ జయశంకర్ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శప్రాయమని కొనియాడారు. రాష్ట్రంలో ఎన్నో ఉద్యమ పాటలకు గూడ అంజయ్య ప్రాణం పోసి ప్రజల గుండెలో నిలిచాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, నాయకులు దేవన్న నాయుడు, డప్పు నాగరాజు, పరమేశ్వర చారి, మాధవ చారి, గంగాధర్ చారి, సత్యం చారి, దేవేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వడ్డె రాములు, జిల్లా రైతు బంధు సభ్యుడు రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌నారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైయిందన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో వాసురెడ్డి, శాంతన్న, రమేష్, నర్సింహగౌడ్, వెంకటేష్‌యాదవ్, నాగేష్, కృష్ణ, బాలస్వామి, రాములు, కృష్ణయ్య, సిద్ధు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు